# "చిల్లర లేదు"

బి. విద్యాసాగర్

నేను పొద్దున్నే కాఫీ త్రాగి న్యూస్ పేపర్ చదువుతున్నాను, విజయవాడలో ప్రజలు, 'చిల్లర' దొరకక చాలా యిబ్బందులు పడుతున్నారనీ, ఏ వస్తువు కొందామని బజారుకు వెళ్ళినా చిల్లర లేదంటున్నారనీ, కాఫీ హోటళ్ళు, దుకాణాల దగ్గర 'దయచేసి చిల్లర పట్టుకురండి', 'చిల్లర లేదు' మంటి బోర్డులు అవతరించాయనీ, బస్సులో యెక్కిన వారిని చిల్లర లేకపోతే దింపేస్తున్నారని వార్త చూశాను. నాకు ఆశ్చర్యం వేసింది ఇంకా చదువుతే, హోటలువాళ్ళు బిచ్చగాళ్ళ వద్ద రూపాయికి మూడు పైసలు కమీషన్ యిచ్చి చిల్లర కొంటున్నారని చదివాను. చూడపోతే, దేశమంతటా చిల్లర లేక అందరూ బాధపడుతున్నారని తెలిసింది.

మా తమ్ముడుని బ్లేడ్లు పట్టుకురమ్మని పది రూపాయల నోటుయిచ్చి బజారుకు పంపించాను వాడు నాలుగైదు కొట్లు తిరిగి, వట్టి చేతులతో తిరిగి వచ్చాడు ఎవరిని అడిగినా ప్రొద్దున్నే పది రూపాయల చిల్లర యెక్కడ వుంటుంది! అన్నారట. ఇక బ్లేడ్ల పేకెట్ తెప్పించడానికి యింకా ఆలస్యం చేస్తూ కూర్చుంటే, ఈ రోజు నేను ఆఫీసుకు వెళ్ళడం కుదరదని, యింటో పదిహేను పైసలు వుంటే దానితో పక్క బ్లేడు తెప్పించి, షేవింగ్ పూర్తి చేశాను.

ఇంట్లో కూరలు, సరుకులు తీసుకురావాలి. పది రూపాయలు తీసుకుని కూరల మార్కెట్‌కి వెళ్తే లాభం లేదని, ముందు బజారుకు వెళ్ళి బ్లేడ్ల పేకెట్, టూత్‌పేస్ట్, సబ్బులు, నూనెలు తీసుకుందామని, పదిరూపాయల నోటుతో బయలుదేరాను. ఒక కొట్టు వాడిని ముందే అడిగాను పదిరూపాయల నోటుకి చిల్లర వుందా సరుకులు తీసుకుంటానని. అతను లేదన్నాడు మరొక కొట్టుకు వెళ్ళి ఈ ప్రశ్న వేస్తే, నాకు కావలసిన సరుకులు యివేళ తీసుకొని వెళ్ళలేనని గ్రహించి, మాట్లాడకుండా నాకు కావలసిన సరుకులు తీసుకుని పది రూపాయలనోటు యిచ్చాను, 'చంపేశామండీ! చిల్లర లేదే! యెలాగ! పోనీ చిల్లర మార్చుకుని వచ్చి సరుకులు తీసుకువెళ్ళండి' అన్నాడు "నేను వెళ్తే యెవరు యిస్తారు! నాకు అవుసరం లేకపోయినా యేదోవొకటి కొంటె కానీ యెవరూ చిల్లర యివ్వరు. దయచేసి ఆ తిప్పలు యేదో మీరే పడండి" అన్నాను.

అతను పక్క కొట్లోకి వెళ్ళి యెలాగో చిల్లర సంపాదించి, నాకు యివ్వాలసిన డబ్బిచ్చాడు. నా దగ్గర యిక రూపాయి పావలా వుంది. తరువాత నాకు కావలసిన కూరలు తీసుకున్నాక! అయిదు పైసలు మిగిలింది. నాకు మళ్ళీ దిగులు పట్టుకుంది. మళ్ళీ పది రూపాయల నోటు మారిస్తే కానీ, ఈ రోజు నేను ఆఫీసుకు వెళ్ళలేను.

ఇంటికి వచ్చి స్నానం చేసి, భోజనం చేసి, మరొక పదిరూపాయలు నోటుతో బయలుదేరాను ఆఫీసుకి. బస్సులో పదిహేను పైసలు టికెట్టుకు పది రూపాయల చిల్లర యివ్వను టికట్టు వెనకాల రాసిస్తానంటాడు కండక్టర్. లేదా చిల్లర లేదు. దిగండి' అని చెప్తాడు. టికెట్టు వెనకాల రాసిస్తే, నేను దిగేటప్పుడు జ్ఞాపకం పెట్టుకుని డబ్బు తీసుకోవాలి. లేకపోతే బస్సుడిపోకి, శలవుపెట్టి వెళ్ళి తెచ్చుకోవాలి. నేను టికెట్ పొరపాటున పారేసుకుంటె, యిక చిల్లర డబ్బులు గోవిందా! ఇలా ఆలోచిస్తు. దగ్గరలోవున్న కొట్లు అన్నింటిలోనూ 'పది రూపాయలకు చిల్లర వుందా!' అంటూ అడిగాను. ఎవరూ లేదన్నారు. ఏదైనా కొంటె కాని చిల్లర యివ్వరని భావించి, ప్రొద్దున బ్లేడ్లు కొన్నా, మళ్ళీ వొక బ్లేడ్ల పేకెట్ కొంటే చిల్లర యిచ్చాడు. దానితో బ్రహ్మానంద భరితుడనయి, ఆఫీసుకు వెళ్ళాను.

అసలు దేశంలో ఈ చిల్లర కొరత యేర్పడటానికి చాలా కారణాలు కనిపిస్తున్నాయి కొంతమంది వర్తకులు ఈ చిల్లర అంత పోగుచేసి దాస్తున్నారు. కొంత చిల్లర బిచ్చగాళ్ళ వద్ద జమ కూడుతున్నది. అర్ధనైపైసలు నాణాలను కరిగించి ఆడవాళ్ళు, గాజులు చేయించుకుంటున్నారట. ఈ మధ్య పేపర్లో పడింది ఈ వార్త చిల్లర కొరత వల్ల బిచ్చగాళ్ళకు లాభాలు, నష్టాలు కూడా వున్నాయి లాభం యెమిటంటే 'అయ్యా! రూపాయికి చిల్లర యిస్తాను ఒక అయిదు పైసలు దానం చేయండి! అంటే, దానంమాట యెలావున్నా, చిల్లర దొరికింది అనే సంతోషంతో కొందరు దానం చేస్తారు. నష్టం యేమంటే, బిచ్చగాడు గొంతెత్తి అరుస్తుంటే, చిల్లర లేదు' అని సమాధానం చెప్పి వెళ్ళిపోతారు జనం.

ఒకరోజు సాయంత్రం ఆఫీసునుంచి యింటికి వస్తూ, బస్సు యెక్కగానే కండక్టర్‌కి రూపాయినోటు యిచ్చాను!. అతను చిల్లర లేదని చెప్పి, టికెట్ వెనుక వైపు 85 పైసలు అని వ్రాశాడు. నేను బస్సు దిగుతూ, చిల్లర సంగతి మరచిపోయి దిగేసి, టికెట్ అవతల పారేశాను. ఇంటికి వచ్చాక జ్ఞాపకం వచ్చింది ఒక క్షణం బాధపడ్డాను. ★